కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..)టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 8, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నాలాలో చెత్తవేస్తే చర్యలు



ఎఆర్‌కే నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ, డీసీ సుభాష్‌రావు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ ఎఆర్‌కె నగర్ లోని నాలా బ్లాకేజీని స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ నాలాలో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా నాలాలో చెత్తతో పాటు థర్మకోలాలు వస్తున్నాయని, ఎక్కడి నుంచి అవి వస్తున్నాయో తెలుసుకొని నోటీసులు ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు జాలసాయి యాదవ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

కటకం భాస్కర్‌కు వైశ్య జాతిరత్న అవార్డు



అమీర్‌పేట: లయన్స్ క్లబ్,వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి కటకం భాస్కర్‌కు వైశ్య జాతిరత్న అవార్డు లభించింది. సీవీ రామన్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులకు సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను కటకం భాస్కర్‌ను అవార్డుకు ఎంపిక చేశారు.


బీసీలకు 42 శాతం నిధులు కేటాయించాలి



సీఎంకు లేఖను విడుదల చేస్తున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు 42 శాతం నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత 11 ఏండ్లుగా బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందన్నారు. జనాభాలో 60 శాతం గల బీసీలకు బడ్జెట్‌లో 6 శాతం వాటా కూడ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



బన్సీలాల్‌పేట్: రోడ్డుపై పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని గాంధీనగర్ పోలీసులు కనుగొన్నారు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ డి. రాజు తెలిపిన మేరకు.. సుమారు 40 సంవత్సరాల వయస్సుగల ఓ వ్యక్తి మృతదేహన్ని బోలక్‌పూర్, క్రిష్ణానగర్‌లో పడి ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్రిష్ణానగర్ చేరుకొని మృతదేహన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పెళ్లిపేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన యువతి అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ సంస్థలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తుంది. కాకినాడకు చెందిన శివకోటి పవన్‌కుమార్ డెంటల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించేవాడు. యువతిని ప్రేమించానని చెప్పడంతో ఆమె అంగీకరించింది. అనంతరం ఇద్దరూ కలిసి రహమత్‌నగర్‌లోని ఒకే గదిలో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని సదరు యువతి చెప్పడంతో పవన్‌కుమార్‌ను తన తల్లి అంగీకరించడం లేదని తప్పించుకుని తిరుగుతున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పవన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మరో రెండు నెలలు కష్టకాలమే..!

ముదురుతున్న ఎండలు..తరుముకొస్తున్న నీటి ఎద్దడి



రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. నీటి అవసరాలూ పెరుగుతున్నాయి. వేసవి ప్రణాళికలో భాగంగా జలమండలి అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నా నీటి ఎద్దడి మాత్రం తరుముకొస్తూనే ఉంది. భూగర్భ జలసిరి అంతకంతకూ అడుగంటిపోతుండడంతో చాలామటుకు బోర్లు ఎండిపోయి నోళ్లు తెరిచాయి. జలమండలి సరఫరా చేస్తున్న నీరు ప్రస్తుత అవసరాలకు సరిపోక ట్యాంకర్లే దిక్కవుతున్నాయి. ప్రస్తుతం ట్యాంకర్ బుక్ చేసిన తర్వాత నీటి సరఫరాకు ఒక రోజు సమయం పడుతుంది, రానున్న రెండు నెలల కాలంలో పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

– సనత్‌నగర్



ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ అధికారులు (ఫైల్)

- అవసరాలకు సరిపోని నీటిసరఫరా
- ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్

సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు సంబంధించి వాటర్‌వర్క్స్ ఫతేనగర్, ఎస్సార్‌నగర్ సెక్షన్ల కింద 13,000 కెనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 5 ఎంజీ నీటిని పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంటారు. ఈ రెండు సెక్షన్లకు సంబంధించి 35 జలమండలి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. రోజురోజుకు నీటి బుకింగ్స్ పెరగడంతో నీటిని అందించడంలో జాప్యం కూడా పెరుగుతోంది.

నీటి సరఫరాలో తగ్గుతున్న ప్రెషర్..

ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని జెక్‌కాలనీ, సుందర్‌నగర్, మోడల్‌కాలనీ, ఎస్సార్టీకాలనీ, ఉదయ్‌నగర్ కాలనీలతో పాటు ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలోని అమీర్‌పేట డీకేరోడ్డు, ఎస్సార్‌నగర్, శ్రీనివాసకాలనీ తదితర ప్రాంతాల్లో నీటి ప్రెషర్ రోజురోజుకు తగ్గిపోతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జెక్‌కాలనీ, సుందర్‌నగర్, మోడల్‌కాలనీ, ఎస్సార్టీకాలనీ, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో 95 శాతం అపార్ట్‌మెంట్లే ఉన్నాయి. ఈ క్రమంలో చాలా అపార్ట్‌మెంట్లకు బోర్లు ఉన్నా ప్రస్తుత అవసరాలను అవి తీర్చలేకపోతున్నాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లకు జలమండలి పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే నీరు ఏ మూలకూ సరిపోవడం లేదు. ఫలితంగా ట్యాంకర్లను బుక్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మోటార్లతో లాగేస్తున్నారు

ఎస్సార్‌నగర్ ప్రాంతంలో ముఖ్యంగా హాస్టళ్లు ఎక్కువగా ఉన్నాయి. పలువురు హాస్టళ్ల నిర్వాహకులు మోటార్లను బిగించుకుని జలమండలి పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటిని అధిక ప్రెషర్‌తో లాగేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నామని అమీర్‌పేట డీకేరోడ్డులో ఓ అపార్ట్‌మెంట్‌లో ఉండే వెంకటేష్ వాపోయారు. దీని ద్వారా ట్యాంకర్లను బుక్ చేసుకోవాల్సి వస్తోందని, ఈ ట్యాంకర్లతో నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా ఖర్చు వస్తోందని పేర్కొంటున్నారు.

ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్..

ప్రస్తుతం ఫతేనగర్, ఎస్సార్‌నగర్ సెక్షన్ల పరిధిలో 150-200 ట్యాంకర్ల బుకింగ్‌లు వస్తుండగా ట్యాంకర్ వచ్చేసరికి ప్రస్తుతం 24 గంటల సమయం పడుతుంది. అయితే ముందు ముందు ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా ఏమేరలో సరఫరా జరుగుతుందోనని అపార్ట్‌మెంట్ నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకర్ల నీటి కోసమే ఒక్కో అపార్ట్‌మెంట్‌కు లక్షల్లో వెచ్చించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

> **రోజుకు రెండు మూడు ట్యాంకర్లు అవసరం..**
>
> మా అపార్ట్‌మెంట్‌కు రోజుకు 2 నుంచి 3 ట్యాంకర్లు తెప్పించుకుంటున్నాం. బోర్ల నుంచి నీరు అంతగా రావడం లేదు. ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయోనన్న భయంతో రెండు మూడు రోజుల ముందే బుక్ చేసుకుంటున్నాం. ట్యాంకర్ల నీటితో అదనంగా ఆర్థిక భారం తప్పడం లేదు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో తలచుకుంటేనే భయంగా ఉంది.
>
> – మల్లారెడ్డి, వాసవీ డ్రీమ్స్, జెక్‌కాలనీ

> **బుక్ చేసిన రోజే ట్యాంకర్**
>
> ప్రస్తుతం బుక్ చేసిన ఒక్క రోజులోనే ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాం. ముందు ముందు ట్యాంకర్ల డిమాండ్ పెరగనున్న దృష్ట్యా అందుకనుగుణంగా ప్రణాళికలు కూడా రూపొందించాం. గత ఏడాది కంటే ఈ సారి ట్యాంకర్లను పెంచడం జరిగింది. నైట్ షిఫ్టులో కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> – వంశీకృష్ణ, వాటర్‌వర్క్స్ డీజీఎం

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాస్ పథకాన్ని కంటోన్మెంట్ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఆదివారం విడుదలైందని తెలిపారు. ఆసక్తికలిగిన యువత ఈ నెల 17 నుంచి వచ్చే 5వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్లలో విధులు నిర్వర్తిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్న కొందరు చైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం బేగంపేటలో ఆయన మాట్లాడుతూ.. బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ఇందుకు టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తించే చైన్‌మెన్‌లే కారణమని ఆరోపించారు. ఎక్కడెక్కడ భవన నిర్మాణాలు జరుగుతున్నదీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సిన చైన్‌మెన్లు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారన్నారు. చైన్‌మెన్ల ఆదాయానికి మించిన ఆస్తుల వివరాలను కూడా త్వరలో ఏసీబీకి అందజేయనున్నామని నవీన్‌కుమార్ మాదిగ తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

లాలాపేట: మండు వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అని లాలాపేట శివాలయం దేవస్థాన కమిటీ చైర్మెన్ వంజరి ముత్యాలు అన్నారు. సోషల్ యాక్టివిస్ట్ పి. మధుబాబు ఆధ్వర్యంలో లాలాపేటలో, శాంతినగర్ చౌరస్తాలో, తార్నాకలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. లాలాపేట రామ్‌థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవానికి ముత్యాలు ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. శాంతినగర్‌లోని చలివేంద్రాన్ని లాలాగూడ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమా పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు డీసీపీ సత్కారం



ట్రాఫిక్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్న అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేట పీఎన్‌టీ జంక్షన్ వద్ద స్పృహతప్పిపడిపోయిన సిర్పూర్‌కాగజ్‌నగర్‌కు చెందిన సురేష్‌కు సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన కానిస్టేబుళ్లను నగర ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. సురేష్ కుప్పకూలిన వెంటనే అక్కడే విధుల్లో ఉన్న బేగంపేట ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆనందం, షేక్ అబ్దుల్ హుస్సేన్‌లు సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించారు. వెంటనే 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించిన తర్వాత సురేష్ కోలుకున్నారు. ఈ మేరకు సురేష్ ఆరోగ్యం విషయంలో వెంటనే అప్రమత్తమై వారి చూపిన చొరవను డీసీపీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య, ఎస్ఐలు ఆనంద్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి

సనత్‌నగర్: తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ఘాటుగా స్పందించారు. ఈమేరకు సోమవారం ఆమె ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఒక రోల్‌మోడల్‌గా మార్చిన పటిష్టమైన నాయకత్వం గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రణాళికబద్ధమైన విధానాలు, బాధ్యతాయుతమైన పాలనతో వ్యవస్థను మెరుగు పరచేందుకు కృషి చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టిన ఆర్థిక గందరగోళాన్ని సరిజేయడానికి, తెలంగాణ సుస్థిర, సమ్మిళిత వృద్ధి దిశగా పయనిస్తుందని నిర్ధారించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని అణగదొక్కవద్దని కేటీఆర్‌ను కోరారు.

పరీక్షలంటే భయం వద్దు.. : డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గడి స్కూల్)ను సోమవారం హైదరాబాద్ జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి సందర్శించారు. ఈ నెల 21 నుంచి పది పరీక్షలు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు బెస్ట్ విషెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పరీక్షలంటే భయపడరాదన్నారు. తగినంత నిద్ర తప్పని సరిగా పోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలూనాయక్, ఇంచార్జి యాకయ్య, గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత



పద్మారావునగర్: పద్మారావునగర్‌లోని శ్రీవత్స నృసింహ పాలపర్తి మోరంపుడి ఫౌండేషన్ కార్యాలయం ఆవరణలో సోమవారం పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేశారు. పాలపర్తి వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే 100వ జన్మదినం జరుపుకుంటున్న విష్ణుభోట్ల సౌభాగ్య లక్ష్మీ కుటుంబ సభ్యులు 'విష్ణుభోట్ల సౌభాగ్యలక్ష్మీ సేవారథం' పేరిట నూతన ఎల్రక్టిక్ ఆటోను జనహిత సేవా ట్రస్ట్, జానకి జీవన్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు విరాళంగా అందజేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

రసూల్‌పురా: రసూల్‌పురా శివానగర్‌లోని కాశీ శివలింగేశ్వర స్వామి శివాలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుక మల్లిఖార్జున్ ఆలయాన్ని సందర్శించి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఎం. జనార్ధన్, ప్రధాన కార్యదర్శి ముఠా ఐలయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలును నిర్మించాలి



జెడ్‌సీ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో గతంలో డబుల్‌బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణంలో భాగంగా కూల్చేసిన కమ్యూనిటీహాలును పునర్నిర్మించాలని బీఎస్పీ సికింద్రాబాద్ అధ్యక్షుడు జోగు ఈశ్వర్ కోరారు. సోమవారం బీఎస్పీ నాయకులు సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. గతంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారని, ఆ సమయంలో స్థానికంగా ఉన్న కమ్యూనిటీహాలును తొలగించారని చెప్పారు. ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉందని.. అక్కడ కమ్యూనిటీహాలును నిర్మించాలని కోరారు. బీఎస్పీ సికింద్రాబాద్ ఇంచార్జ్ బక్కూరి నర్సింగ్‌రావు, కిరణ్, వినయ్, అబీద్‌లు ఉన్నారు.

వార్డు అభివృద్ధికి సహకరించండి



భానుక నర్మదను కలిసి అభినందించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

బొల్లారం: కంటోన్మెంట్ 7 వ వార్డ్ అభివృద్ధికి సహకరించాలని వార్డు మాజీ మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ నామినేటెడ్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌కు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలిగా భానుక నర్మద ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శ్యామ్ కుమార్ సోమవారం ఆమెను బోర్డు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువా తో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



రూ.10 వేల చెక్‌ను అందుకుంటున్న ఏవీ కాలేజీ జట్టు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ముగిసిన భగత్‌సింగ్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు బల్మూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతగా నిలిచిన ఖైరతాబాద్‌లోని ఏవీ కాలేజీ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన ఈసీఐఎల్‌లోని వసుంధర కాలేజీ జట్టుకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నర్సింహా, వీఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఓయూలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఇందిరా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం క్యాంపస్‌లోని సి గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.

ఏబీవీపీ నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనల పై నిషేధం విధిస్తూ జారీ చేసిన సర్క్యులర్ ఉపసంహరించుకోవాలని సోమవారం ఓయూ బంద్‌కు ఏబీవీపీ పిలుపు ఇవ్వడంతో క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున కీలక నేతలు, జీవన్, పృథ్వీ తేజలను ముందస్తు అరెస్ట్ చేశారు.

ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి



వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రతిరోజూ ఎంతోకొంత సమయం వ్యాయానికి కేటాయిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి అన్నారు. జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కులో రూ.4 లక్షల వ్యయంతో జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసిన జిమ్ పరికరాలను ఆదివారం ఆమె కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ తేలికగా ఉండే వ్యాయామాలను చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు సుబ్బరాజు, విశ్వనాథరాజు, శివారెడ్డి, నాగిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు కొలను బాల్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అభివృద్ధికి కృషి





సనత్‌నగర్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. ఇటీవల యాదవ యుద్ధనౌక అవార్డు గ్రహీత మేకల రాములుయాదవ్ సన్మాన కార్యక్రమంలో ఆయనను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంపై జాతీయ అధ్యక్షుడికిగా కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కంటోన్మెంట్: అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బోయిన్‌పల్లికి చెందిన చిన్నాల శ్వేతా యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగాన్ని బలోపేతం చేయడమే తన లక్ష్యమని అన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హర్షం

లిబర్టీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. బిల్లుకు అన్ని పక్షాలు మద్దతు ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు పోవాలన్న నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. కేంద్రం బీసీలకు అన్యాయం చేసే తిరుగుబాటు తప్పదన్నారు.